ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వంతెనలు

- నెర్రలిచ్చిన శ్లాబులు, ఫిల్లర్లు
- కూలేందుకు సిద్ధంగా ఉన్న లింగన్నకోడుపై వంతెనలు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

కోడూరు: కూలేందుకు సిద్ధంగా ఉన్న శ్లాబులు.. నెర్రలిచ్చిన ఫిల్లర్లు.. డ్రెయిన్‌లో కలిసిపోయిన రెయిలింగ్‌లు.. ధ్వంసమైన అప్రోచ్‌లు. ఇది కోడూరు మండలంలోని లింగన్నకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెన దీనస్థితి. దివిసీమలోని సముద్రతీరానికి అతిసమీపంలో ఉన్న కోడూరు మండలంలో రైతులు నిత్యం రాకపోకలు సాగించే వంతెనలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని జయపురం, లింగారెడ్డిపాలెం, విశ్వనాథపల్లి, నరసింహాపురం, హరిపురం, ఉల్లిపాలెం, పాలకాయతిప్ప గ్రామాలకు సంబంధించిన పంటపొలాల్లోని మురుగు సముద్రంలోకి వెళ్లేందుకు లింగన్నకోడు డ్రెయిన్ ఎంతగానో దోహదపడుతుంది. అయితే ఈ డ్రెయిన్‌పై రాకపోకలు సాగించేందుకు సుమారు 50 ఏళ్ల క్రితం నరసింహాపురం సమీపంలో రెండు వంతెనలు, హరిపురం సమీపంలో ఒక వంతెన, ఉల్లిపాలెం శ్రీమన్నారాయణుడి ఆలయం సమీపంలో మరో వంతెన నిర్మించారు. రెండేళ్ల క్రితం నరసింహాపురం వద్ద ఉన్న వంతెన భారీ వాహనం వెళ్లిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఈ ప్రాంత రైతులు వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణానికి రూ. 43.40లక్షల నిధులు కేటాయించింది. నిధులు కేటాయించడమే కాకుండా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి కూడా తీసుకువచ్చింది.



ఉల్లిపాలెం వద్ద రెయిలింగ్ ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్న వంతెన

లింకు రోడ్లు అవసరం

లింగన్నకోడు డ్రెయిన్ పొడువునా ఉన్న రెండు వైపుల గట్లను పటిష్టపరిస్తే గ్రామాల మధ్య లింకు రోడ్లు ఏర్పడతాయని రైతులు చెబుతున్నారు. లింకు రోడ్లు నిర్మిస్తే నరసింహాపురం నుంచి నేరుగా హరిపురం, ఉల్లిపాలెం చేరుకునేందుకు దగ్గర అవుతుంది. ఉల్లిపాలెం వద్ద నూతన వంతెన నిర్మిస్తే వేణుగోపాలపురం, సాలెంపాలెం గ్రామాల మధ్య లింకు రోడ్డుకు అవకాశం ఉంటుంది. ఈ లింకు రోడ్లను అభివృద్ధి చేస్తే గ్రామాల మధ్య దూరం తగ్గి ఉపయోగకరంగా ఉంటుంది.



హరిపురం వద్ద శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన



నరసింహాపురం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వంతెన

పట్టించుకోని పాలకులు, అధికారులు

లింగన్నకోడుపై వంతెనలు శిథిలావస్థకు చేరాయని పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. వంతెనలు కూలిపోతే తమ పొలాలకు వెళ్లేందుకు అవకాశం కూడా ఉండదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే నూతన వంతెనల నిర్మాణానికి కృషి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు



లింగన్నకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెనలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వంతెనల శ్లాబులు, రైలింగ్‌లు, ఫిల్లర్లు పూర్తిగా శిథిలమైయ్యాయి. ఈ వంతెనలు కూలితే పంటపొలాలకు వెళ్లేందుకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వంతెన నిర్మాణాలు చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవించినా మా గోడు పట్టించుకున్నవారే కరువైయ్యారు.

– అదుసుమిల్లి రాము, రైతు, ఉల్లిపాలెం

శిథిలావస్థకు చేరిన వంతెనలు

నరసింహాపురం, హరిపురం, ఉల్లిపాలెం సమీపంలో ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వంతెనల కింది భాగంలో శ్లాబులు నెర్రలిచ్చి పెచ్చులూడుతున్నాయి. నెర్రలిచ్చిన ఫిల్లర్లు.. డ్రెయిన్‌లో కలిసిపోయిన రైలింగ్‌లు.. ధ్వంసమైన అప్రోచ్‌లు.. ప్రస్తుతం వంతెన పైభాగంలో కూడా నెర్రలు కనిపించడంతో ప్రయాణాలు చేసేందుకు ప్రజలు హడలిపోతున్నారు. వంతెనకు రైలింగ్‌లు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనచోదకులు డ్రెయిన్‌లో పడిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

లింకు రోడ్లు నిర్మించాలి



లింగన్నకోడు డ్రెయిన్‌పై ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ వంతెనపై రాకపోకలు సాగించాలంటే భయాందోళన తప్పడం లేదు. పొలాల్లో నుంచి పంటను ఈ వంతెనలపై తీసుకురావాలంటే రైతులు హడిపోతున్నారు. నూతన వంతెనలతో పాటు లింకు రోడ్లను కూడా వెంటనే నిర్మించాలి.

– కమ్మిలి కోటేశ్వరరావు, రైతు, ఉల్లిపాలెం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: అవనిగడ్డలోని కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీ కృష్ణనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ నాగాయలంక రోడ్డులోని కొత్త విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ తుంగలవారిపాలెం విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించడానికి కొత్త సబ్‌స్టేషన్, మండల పరిధిలోని గుడివాక వారిపాలెం, తుంగలవారిపాలెం, వేకనూరు గ్రామాల్లోని గృహాలకు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



కృత్తివెన్ను: మండలంలోని చినగొల్లపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోవెలగిరి అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉత్సవాలను పురస్కరించుకుని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విచ్చేసి పూజలు చేశారు. ఎమ్మెల్యే కాగితకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

కొనసాగుతున్న అద్దంకి నాంచారమ్మ ఉత్సవాలు



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పలు రకాల పూలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



ఘంటసాల: ఘంటసాల అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు బౌద్ధ గురువు భంతే ధమ్మ ధజ థెరో(బంతిజీ) ఆధ్వర్యంలో బౌద్ధ సంప్రదాయాలతో ఆదివారం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దాతలు, గ్రామస్తుల ఆర్థిక సహకారం, సమన్వయంతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పనుల ప్రారంభానికి ముందుగా గౌతమ బుద్ధుడు విగ్రహం, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద బంతిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంతిజీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, దేశాభివృద్ధికి గౌతమ బుద్ధుని బోధనలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాల ద్వారానే సాధ్యమన్నారు. అంబేడ్కర్ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత విద్యనభ్యసించి బహుజనులకు సమాజంలో గౌరవం కల్పించారని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి తనవంతుగా రూ. 5వేల ఆర్థిక సాయాన్ని కమిటీ సభ్యులకు అందించారు. అంబేడ్కర్ నగర్ వాసులు బంతిజీను సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

పామర్రు: నేటి సమాజంలోని మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని బిషప్ కొడాలి శామ్యుల్ పేర్కొన్నారు. స్థానిక చాట్ల వానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో పలువురు మహిళలను ఆదివారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి తమ సత్తా చాటాలని సూచించారు. మహిళలు మరింతగా సమర్థవంతంగా కృషి చేసి చైతన్యం కావాలని కోరారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజన్ లైఫ్ సెంటర్ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రారంభమైన వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి పంచామృత స్నపనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ధ్వజపట గ్రామోత్సవం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అజస్రదీపారాధన, దీక్షాస్వీకరణ, మృద్గ్రహణ, అంకురారోహణ, ధ్వజపట ప్రతిష్ట, ధాన్యాధివాసము, హోత్ర ప్రశంసనం, నీరాజన మంత్రపుష్పములు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని సోమవారం ఉదయం పెళ్లి కుమారునిగా చేయనున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కే వేణుగోపాలరావు, భక్తబృద ప్రతినిధులు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుద్దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఘంటసాల ఏపీఎం బదిలీ

ఘంటసాల: ఘంటసాల మండలం వెలుగు ప్రాజెక్టు ఏపీఎంగా పని చేస్తున్న ఎం.పాండురంగ ప్రసాద్ బదిలీ అయ్యారు. గుడ్లవల్లేరు మండలం ఏపీఎంగా ఆయన బదిలీపై వెళ్లారు. గత ఏడాది నవంబరులో ఘంటసాల ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన పాండురంగ ప్రసాద్ నాలుగు నెలలు పాటు విశేషమైన సేవలందించారు. బదిలీల్లో భాగంగా గుడ్లవల్లేరు మండలం వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన ఏపీఎం వచ్చే వరకు ఘంటసాల మండలానికి మొవ్వ ఏపీఎం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారని అధికారులు తెలిపారు.

ఆదర్శ నాయకుడు రమణయ్యనాయుడు

మచిలీపట్నంటౌన్: పదవులకు వన్నె తెచ్చిన గొప్ప ఆదర్శ నాయకుడు రావు బహదూర్ కొల్లిపర వెంకట రమణయ్యనాయుడు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సంఘ సంస్కర్త, కృష్ణా కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ రమణయ్య జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. రేవతి సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితర నాయకులు ఆవిష్కరించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ వేము కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు, బీజేపీ నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



రమణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి

కొల్లూరి కుటుంబ సభ్యులకు పరామర్శ

చల్లపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన లక్ష్మీపురం శివారు రామానగరం దళితవాడకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కొల్లూరి నానయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. దళితవాడలోని నానయ్య ఇంటికి వెళ్లి నానయ్య భార్య, లక్ష్మీపురం పంచాయతీ తొమ్మిదవ వార్డు సభ్యురాలు సుజిరాణి, కుమారులు నవీన్, నరేంద్ర, కుమార్తె నళినికుమారిలను పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నానయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింహాద్రి వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్, నాయకులు మత్తి రాంబాబు, మోదుమూడి కుటుంబరావు, కొల్లూరి కృష్ణ, కొల్లూరి ముద్దుకృష్ణ, శివరావు, ముచ్చు శ్రీను, కొక్కిలిగడ్డ ఆదిశేషు, ముచ్చు భాను, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు.



కొల్లూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పెడన: పెడన – గుడివాడ ప్రధాన రహదారిపై బైపాస్ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. పెడన పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నందమూరు పంచాయతీ కోటవానిపాలెం గ్రామానికి చెందిన ఓలేటి నవీన్(27), పేరం విజయకుమార్(28) ఆదివారం గుడివాడలో మినుము నూర్పిళ్లకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. పెడన–గుడివాడ బైపాస్ రోడ్డు సమీపంలోకి రాగానే మచిలీపట్నం వైపుగా వస్తున్న లారీ నవీన్, విజయకుమార్‌ల ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెడన ఎస్‌ఐ జీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 165మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, లయన్స్ ప్రతినిధులు సుధా, గాంధీప్రసాద్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో వివిధ హోదాల్లో పని చేసిన ఎస్ సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సుబ్రహ్మణ్యం అభినందన సభ స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పేర్ని కిట్టు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం తన ఉద్యోగ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తూనే ఓబీసీ ఉద్యోగుల సంఘ నాయకునిగా ఆ సంఘ బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన శేష జీవితాన్ని సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు.



సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులతో పేర్ని కిట్టు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

పెడన: మండల పరిధిలోని చేవేంద్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివలింగ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణ శాస్త్రి శిష్యబృందం యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్టా, పూర్ణాహుతి, ఆచార్య పూజ తదితర కార్యక్రమాల అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంకెం చినసుబ్బారావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి హాజరైన భక్తులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులతో ఆనాటి గురువులు

పెడన: వారంతా 1976–77లో భట్ల జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. 55 ఏళ్ల తర్వాత మళ్లీ వారంతా కలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. ఆనాటి రోజులు మళ్లీ రావంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందభరితులయ్యారు. ఆనాడు చదువు చెప్పిన నేటి విశ్రాంత గురువులు గోవర్ధనరావు, ప్రభాకరరావు, తేజోవతి, భానుమతిలను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, స్థానిక ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్, అతని భార్య మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వాఖ్యాతగా బీఎస్ఎస్ మీనా కుమారి వ్యహరించగా పూర్వ విద్యార్థులు ఎంతో ఆనందంగా గడిపారు.

బీడు భూమి అనుకుంటే పొరబడట్టే..!

అధ్వానంగా లింగన్నకోడు డ్రెయిన్

కోడూరు: ఈ చిత్రంలో కనిపిస్తున్నది బీడు భూమి అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే.. ఎందుకంటే ఇది వేలాది ఎకరాల పంటపొలాలకు సంబంధించి మురుగు పోయే అతి ప్రధానమైన డ్రెయిన్. కోడూరు మండలంలోని నరసింహాపురం సమీపంలో లింగన్నకోడు డ్రెయిన్‌లో పిచ్చిమొక్కలు, దుబ్బు పెరిగిపోయి పూర్తి అధ్వానంగా మారింది. ఈ లింగన్నకోడు డ్రెయిన్ ద్వారానే లింగారెడ్డిపాలెం, జయపురం, విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, హంసలదీవి గ్రామాలకు సంబంధించి పంటపొలాల్లో మురుగు సముద్రంలోకి ప్రవహిస్తుంది. సముద్ర ఆటుపోట్లు, భారీ వర్షాలు, వరదల సమయంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో మురుగు ఈ డ్రెయిన్ ద్వారా దిగువకు వెళ్తుంది.



నరసింహాపురం సమీపంలో లింగన్నకోడు డ్రెయిన్ దుస్థితి

గత ఏడాది వచ్చిన వరదల సమయంలో ఈ డ్రెయిన్ తూడు, దుబ్బులతో పూడిపోయి ఉండటంతో పొలాల్లోని వర్షం నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక వరిపంట మునకబారిన కూడా పడింది. డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. వేలాది ఎకరాల్లో మురుగు పోయేందుకు దోహదపడే లింగన్నకోడు డ్రెయిన్ దుస్థితి చూస్తుంటునే పాలకుల పని తీరు అర్థమవుతోందని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



మాట్లాం గ్రామంలోని పాఠశాల సమీపంలో అధ్వానంగా చెత్తకుప్పలు



నివాసాల మధ్య ప్లాస్టిక్ కవర్లు, చెత్తనిల్వలు

కృత్తివెన్ను మండలం మాట్లాం గ్రామ పంచాయతీలో నివాసాల మధ్యనే చెత్తకుప్పలు, పాఠశాలకు అత్యంత సమీపంలో డంపింగ్ యార్డులను తలపించేలా అపరిశుభ్రంగా చెత్తనిల్వలు పేరుకుపోయాయి. దీంతో దోమలు, విషసర్పాల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఫొటోల్లో పారిశుద్ధ్య చర్యలు కాకుండా క్షేత్రస్థాయిలో పరిశుభ్రత ఉండేలా గ్రామస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కృత్తివెన్ను

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధికసంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.